# పసిడిబొమ్మ

నేను హోటల్లో కూచుని కాఫీ తాగుతోంటే ఓ పెద్ద మనిషి గబగబా వచ్చి, "మీ పేరు శంకరం కదూ?" అన్నాడు. ఎవరితను అనుకొని, క్షణం సేపు తేరిపార చూసి, ఏంతేలక, "అవును ఏం?" అన్నాను.

"మీ రాజారావు లేచి పోయాడుగా...!" అన్నాడు, ఎంతో ఉత్సాహంగా.

"ఏ రాజారావు?"

"రాజారావు తెలీదూ?... మీ స్నేహితుడు... ఆర్టిస్టు..."

"ఓ వాడా.." అన్నాను చప్పగా, తిరిగి కాఫీ గుటకలేస్తూ. అతను పాపం కాసేపు చాలా ఆదుర్దాగా ఎదురు చూసి, ఎంతకూ నాలో ఏమాత్రం చలనం కలగక పోగా, ఆఖరికి ఒక్క తిరుగు ప్రశ్నైనా వెయ్యక పోవటంతో గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

నాకు నిజంగా జాలి వేసింది_ రాజారావు పైన కాదు. ఆ పెద్ద మనిషి పైన. అయినా అతనంత నిరుత్సాహ పడటం దేనికో? బహుశః జీవితాన్ని నిండుగా అర్థం చేసికోని మనిషై ఉంటాడు. కాకపోతే ఒక మనిషి - నా స్నేహితుడే కావచ్చు - లేచిపోయాడన్నంత మాత్రాన నేను నిర్ఘాంతపోయి ఢగ్గున లేచి ప్రశ్నల పరంపర కురిపించలేదని అతనంత నిరుత్సాహ పడటం దేనికి??... అందులోనూ రాజా_ జీవితాన్ని రంగు కుంచెలా వాడుకునే కళాకారుడు రాజా_ ఎటు తన్నుకుపోతే ఏం? నేను పొట్ట కోసం ఇంతదూరం, పట్నానికి లేచి పోయిరాలా? రేపు మరో చోట నాలుగు రాళ్లు ఎక్కువ దొరికే ఆశే వుంటే అక్కడికి లేచిపోనూ? ఎవరి ఆదర్శాలు వారివి, ఎవరి అవసరాలు వారివి_ ఒకే కొలబద్దతో అందరు మానవుల్నీ కొలవచ్చా?

నిజంగా నాకూ రాజాకు ఎంత తేడా! ఇద్దరమూ ఒకే పరిస్థితులలో పుట్టి, పెరిగి, ఇప్పటికీ దాదాపు ఒకే విధమైన జీవితావసరాలకు లోనై వున్నా, మా ఇద్దరి ఆదర్శాలలో ఎంత అంతరం వుంది! కళ కోసమే జీవితం అంటాడు రాజా. అన్ని కళలూ జీవితం కోసమేనని నా మతం.

ఒకరోజు రాజా చాలా రోజులకు కనబడి, తీరిగ్గా మాట్లాడుకోటానికి వీలుంటుందని హోటల్లోకి దారి తీశాడు. మోడరన్ ఆర్టు ఎగ్జిబిషన్‌లో తాను పెట్టబోయే 'మేనక' చిత్రాన్ని గురించే చెప్పుకు పోతున్నాడు. ఇంతలోకి పక్కనే కూర్చున్న ఓ సాహుకారు, "ఏమండీ మా కొట్టుకో బోర్డు రాసిపెడ్తారా?" అన్నాడు రాజానుద్దేశించి. రాజా చప్పున అటుతిరిగి మొహం చిట్లించుకుని, అతణ్ణో చీడ పురుగులా హేయంగా చూసి, నా వేపుకు తిరిగి "హుఁ ఏం మనుషులు" అన్నాడు.

"ఏం...? రాయరాదూ, డబ్బొస్తుంది?" అన్నాను.

రాజాకు షాక్ తగిలింది? "నువ్వా ఇంతేనా?" అన్నట్టు నాకేసి ఆశ్చర్యంగా జాలిగా క్షణంపాటు చూసి, "ఊహుఁ, నాకు చేత కాదు" అన్నాడు మొహం తిప్పేసుకుని. "నీకు చేతకాక పోవటమేమిటి? అంత

అందమైన ఆడవాళ్ళ చిత్రాలు గీస్తావు. వెధవ అక్షరాలే రాయలేక పోతావా?" అన్నాను.

"అది కమర్షియల్ ఆర్టు."

"అయితే?"

"నీకు అర్థం కాదులే. నేనింకా అంతదాకా దిగజారి పోలేదు," అన్నాడు.

రాజా ఇప్పుడు లేచి పోయాడంటే డబ్బుకోసం మాత్రం కాదని నిక్కచ్చిగా చెప్పొచ్చు. కళా కాంతుల్ని వెదజల్లి, లోకకల్యాణానికీ, మానవాభ్యుదయానికీ దారితీసే ఒక ఆదర్శప్రాయుడు మరొక మజిలీ ముందుకు వెళ్ళాడంటే, నిజంగా నేనెంతో సంతోషించాలి.

కాని, అన్నట్టు, రాజాకు భార్య అంటూ ఒకరు వుండాలెకదూ?... ఆఁ, అవునవును... జ్ఞాపకమొస్తోంది. వుండాలి. నిజంగా వాడికి పెళ్ళెప్పుడైందో నాకు తెలీదు. కాని తనకొక భార్య వున్నట్టు వాడే ఒకసారి సూచించాడు. ఆల్ ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్ ఈ ఊళ్ళో జరిగినప్పుడు నేనాదారినే పోతోంటే రాజా కన్పించాడు. వెంటనే నన్ను లోపలికి తీసికెళ్ళి తాను గీసిన చిత్రాన్ని చూపెట్టాడు. అప్సరసలాంటి స్త్రీ చిత్రం– నగ్న చిత్రం అది. మంత్రముగ్ధుణ్ణయి చూస్తూ నిలుచుండి పోయాను.

"ఏం? ఎలా వుంది?" అన్నాడు కొంతసేపటికి.

నేను తేరుకుని, "అద్భుతం అత్యద్భుతం," అన్నాను హృదయపూర్వకంగా రాజాను కౌగలించుకుంటూ.

"ఎవరో తెలుసా? నా భార్య" అన్నాడు నా చెవిలో.

"ఆ నిజమా?" చకితుణ్ణయి పోయాను. ఇక అక్కడో క్షణం నిలవలేక పోయాను. తక్కిన చిత్రాలేవీ చూడకుండానే వొచ్చేశాను.

అ తర్వాత అప్పుడప్పుడు కలుసుకునేవాళ్ళం. తన ఆ చిత్రానికి ప్రైజుకూడా వచ్చిందని చెప్పాడు. కాని నేను వెంటనే విషయం మార్చే శాను. అతని ఇంటికి కూడా మళ్ళీ ఎప్పుడూ వెళ్ళలా.

ఇంతవరకూ ఆ చిత్రం నిజంగా వాడి భార్యదానో కాదో, అసలు వాడికి భార్య అంటూ ఒకర్తె వుందో లేదో కూడా నిర్ధారణ కాలా. వుంటే ఇప్పుడామె సంగతి ఏమై వుంటుంది? రాజా తనతో తీసికెళ్ళాడా!.... లేక... ఎట్లా తెలిసేది?... ఇందాకటి పెద్దమనిషికి తెలిసివుంటుంది; కాని అతను అప్పుడే వెళ్ళిపోయాడే. అతనెవరో కూడా తెలిసికోలేదే.

హోటల్ ఈవలికొచ్చి వెతికాను ఎక్కడేనా కనిపిస్తాడేమోనని— ఉహు, కనిపించలా.

అయినా నాకెందుకింత తాపత్రయం? నిజంగా రాజాకు భార్యే వుండి, ఇప్పుడామె దిక్కులేనిదై పోయివున్నా నేనేం చేయగల్నా? ఆమెను వుద్ధరించే స్థితిలోనే వున్నానా నేను?— ట్యూషన్లు చెప్పుకుని పొట్ట గడుపుకొనే నేను?... ఉహుఁ వృథా ప్రయాస— ఇంటికి దారి తీశాను.

కాని మనస్సు ఒప్పుకోలా. ఈ సంగతి తేలితేనే గాని మనసు కుదుటపడేట్టు లేదు. రాజా ఇంటికెళ్ళి కనుక్కుంటే తెలిసిపోతుందని, పాత ఆనవాళ్ళ అధారాన తిన్నగా రాజా ఇల్లు చేరుకున్నాను.

తలుపు వేసివుంది. తట్టాను. కాసేపటికి తలుపు తెరిచింది ఓస్త్రీ.. ఎంత అందంగా వుంది! ఎక్కడో చూసినట్టే వుంది. కాని ఎక్కడా?... నాకేసి ప్రశ్నార్థకంగా చూస్తూ నిలుచుంది.

"రాజా కోసం."

"రండి లోపలికి"— దారి తీసింది.

రాజా వున్నాడా? అంతా వుత్తదేనా?... ఆమెను అనుసరించాను.

## పసిడి బొమ్మ

రెండే రెండు గదులు. కిందటి తడవ నేను వచ్చినప్పుడు రాజా ఒంటరిగా వున్నాడు. గదుల్నిండా గుడ్డలూ, పుస్తకాలూ, రంగు చిప్పలూ, రంగు కుంచెలూ, చిత్రాలూ కలగాపులగంగా పడివున్నాయి. కాని ఇప్పు డంతా శుభ్రంగా వుంది. అట్టె వస్తువులుకూడా లేవు. రెండు మూడు విరిగి పోయిన కుర్చీలూ, కొన్ని గుడ్డలూ, ఒక ట్రంకూ, కొన్ని చిత్రాలూ మాత్రం వున్నాయి.

నన్ను కుర్చీలో కూచోమని తాను ట్రంకు పైన కూచుంది ఆ స్త్రీ... ఈమెనా రాజా భార్య?...

''రాజా...''

''లేడు.''

''ఎక్కడికెళ్ళాడూ?''

''ఏమో... చెప్పలా.''

''ఓ, అయితే నిజమేనన్నమాట.''

మౌనం.

''ఎప్పుడు వెళ్ళాడు?''

''వారం రోజులైంది.'

మౌనం

''కారణం ఏమైవుంటుందో...?''

''తెలీదు''

"డబ్బు యిబ్బందులేమైనా వచ్చాయా?"

"కొత్తగా ఏమీ రాలేదు!"

''మీరూ......?''

''నా పేరు రాధ.''

ఇంకేం మాట్లాడాలో తోచలేదు.

''ఈ గదినిండా చిత్రాలు వుండేవే!''

"ఒక్కొక్కటే అమ్మకు తింటున్నాను."

మనసు చివుక్కుమంది.

''ఎన్నాళ్ళిట్లా?''

"ఏమో......?"

గుండెలు ద్రవించాయి. ఏం చెయ్యను? నా స్నేహితుని భార్యను రక్షించడానికి నేనేంచెయ్యను? "లే పద, రాజా తిరిగి వచ్చేదాకా నా దగ్గర వుందువుగాని. నేను పోషిస్తాను," అని నోటిదాకా వచ్చింది. కాని ధైర్య మాగలా. "వస్తాను," అంటూ లేచాను, నిర్దయగా.

గుమ్మందాటాక వెనకనించి పిలుపు వచ్చింది, "ఏమండీ మీ పేరు శంకరం కదూ'' అని.

ఆశ్చర్యంతో తిరిగి చూశాను.

"అవును మీ కెట్లా తెలుసు."

"నేనప్పుడే అనుకున్నాను వుండండి. రాజా మీకోసం ఒకవుత్తరం వదలి వెళ్ళాడు,'' ట్రంకు తెరచి కవరు అందించింది.

నాకేమీ పాలుపోలా. కవరు జేబులో కుక్కుకుని గబగబా యింటికి వచ్చేశాను.

"శంకరం!

నేను వెళ్ళిపోతున్నాను, తిరిగి వస్తానో రానో చెప్ప లేను. నేను వెళ్ళానని తెలియగానే నువ్వు పరుగెత్తుకు వస్తావని నాకు తెలుసు. అందుకే యీ వుత్తరం.

నీ రాజా:"

ఏమిటీ వుత్తరం? దీని కర్థమేమిటి? నన్నేం చెయ్యమంటాడు. రాజా నా సంగతంతా తెలిసికూడా నానించి ఏం ఆశించాడు...ఏంచెయ్యను, ఎట్లా సహాయం చెయ్యను?... ఏదో ఒకటి చెయ్యాలని తహతహలాడు తోంది మనసు... కాని నా అసహాయత నన్ను వెనక్కు లాగుతోంది. ఈ సందిగ్ధావస్థలో రెండు రోజులు గడిచిపోయాయి. ఆఖరికి అసహాయత గెలిచింది. నా నిత్య జీవితపు పెనుగులాటలో యీ విషయం అడుగంటి పోయి నేను మరిచికూడ పోయాను.

కొన్నాళ్ళకు ఒకరోజున పొద్దున్నే ట్యూషన్‌కు వెళ్దామని తలుపు తెరిచేసరికి యింటిముందు అరుగుమీద కూచునివుంది రాధ. నేను వులిక్కిపడ్డాను. "రాధా...?"

''అవును. నేనే'' లేచి నిలుచుంది రాధ.

''ఎప్పుడు వచ్చావ్?''

"ఇప్పుడే... ఇంట్లోంచి తరిమివేశాడు యింటి యజమాని."

నానోట మాటరాలా. అప్రయత్నంగా ప్రక్కకు తొలిగాను. ఇంట్లోకి వచ్చి నిలుచుంది రాధ.

''సామానో మరీ?''

''ఏమీ మిగల్లేదు?''

ఇంక అక్కడ నిలువలేకపోయాను. తాళాలు అక్కడే పడేసి బయటికి వచ్చేశాను.

ఇంక లాభంలేదు. ఏదో విధంగా భరించి తీ రా ల ని అప్పుడు ట్యూషను కుర్రాళ్ళను బ్రతిమాలి, వాళ్ళని వెంటేసుకు తిరగ్గా తిరగ్గా అతికష్టంమీద మరో రెండు ట్యూషన్లు దొరికాయి. అవీ పదిహేను రూపాయల ట్యూషన్లు పదేసి రూపాయలకే ఒప్పుకోవాల్సి వచ్చింది.

మధ్యాహ్నం హోటల్‌నించి కారియర్‌లో భోజనం పెట్టించుకు ఇల్లు చేరుకునేసరికి రాధ గదిమధ్య అల్లానే కూర్చుని ఉంది. వెంటనే భోజనానికి సిద్ధం చేశాను. తినే పళ్ళెం ఒకటేవుంది. అందులో రాధకు పెట్టి నేను టిఫిన్ గిన్నెలోనే తినేశాను.

సాయంత్రం హోటల్ యజమాని దగ్గిర అప్పుపెట్టి మరో పళ్లెమూ, ఒక చీర, బ్లౌజు కొనుక్కొచ్చాను.

ట్యూషన్లు ఎక్కువవటం మూలాన అసలే తీరిక లేకుండాపోయింది. రెండు రోజులు అసలు మా మధ్య ఏమీ మాటలు లేకుండానే

గడచిపోయాయి. మూడోరోజు మధ్యాహ్నం భోంచేస్తోన్నప్పుడు అంది రాధ, 'ఎన్నాళ్లు హోటల్ భోజనం? నేను వంటచేయనా?''

''ఉహుఁ, వొద్దు''

''ఏం నా చేతివంట తినరా?"

"అదికాదు ? హోటలు భోజనానికి నేను బాగా అలవడిపోయాను. ఆ అలవాటు తప్పితే మళ్ళీ ముందుకు కష్టం!"

రాధ తిరిగి ప్రశ్న వేయలా.

మరో నాలుగురోజులు గడిచిపోయాయి, ఏమీ మార్పు లేకుండానే.

ఒక రోజు రాత్రి, భోంచేశాక పడుకోబోతోంటే అందుకుంది రాధ,

''ఇలా ఇంకెన్నాళ్లు?"

"ఏమిటి?"

''ఈ తామరాకుపై నీటిబిందువు జీవితం... నాకు విసుగు పుడుతోంది.''

"ఏం ?"

"మీరు భుక్తి కోసం ఎన్ని తిప్పలు పడుతున్నారో నేను చూస్తూనే వున్నాను. నేను మీకేసహాయమూ చేయలేనా?"

''ఏం చేస్తావు?''

''అదే నాకు తోచటంలేదు... రాజా నన్నలా తయారుచేశాడు.'

"ఏలా?"

"ఎందుకూ పనికిరానిదానిలా, నాకో చదువూ, సంగీతమూ, నాట్యమూ ఏవీరావు. ఇవన్నీ నా అందంముందు ఎందుకూ పనికిరావనే వాడు. నన్నో అపురూప సుందరిలా పొగిడి ఆకాశానికి ఎత్తేశాడు. నేనూ రాజా మాటలకు పొంగిపోయి నన్ను నేనే మరచిపోయాను. ఇప్పుడు తెలు

స్తోంది నా విలువ. రాజా నన్నో బొమ్మలా వాడుకున్నాడు. ఆఖరికి పెంట కుప్పమీద పారేసి వెళ్ళిపోయాడు."

"రాజా అలాంటి మనిషికాడు. తప్పకుండా తిరిగి వస్తాడు. కట్టుకున్న భార్యను వదలి..." పెద్ద మనిషి తరహాగా మాట్లాడబోయాను.

రాధ మధ్యలో అందుకుంది— "కట్టుకున్న భార్యా.. ఎవరన్నారు?"

"ఏం?"

"ఉహుం, మాకు పెళ్ళి కాలేదు... చేసుకుందామనే అనుకున్నాం కాని వీలు పడలేదు"

నేను మాట్లాడలేకపోయాను.

మరి కొద్దిరోజులు గడిచాయి. ఏ మార్పూలేదు.

...ఒక రోజు రాధ ఖచ్చితంగా చెప్పేసింది, తానుమాత్రం ఇక హోటలు భోజనం తినలేనని. నేనేమీ జవాబివ్వకుండా జారుకున్నాను. రాత్రికి వచ్చేసరికి రాధ వంటచేస్తోంది. స్టౌ, గిన్నెలూ ఎన్నో కొత్తవి వున్నాయి. నాకు ఆశ్చర్యం వేసింది, ఏమనాలో తోచలా, హోటలు కారియర్‌కోసం చూస్తే కనిపించలా. తిప్పేశానని చెప్పింది రాధ. వంట తయారైంది, భోజనానికి లెమ్మంది, కాని నేను హోటలు భోజనం తప్ప తిననన్నాను. వెళ్ళి పక్క పడుకున్నాను. వచ్చి బ్రతిమాలింది. కాని నేను వెళ్ళలా, "సరే, మీ ఇష్టం" అని వెళ్ళిపోయింది.

రెండో రోజునుంచి ఎన్నో మార్పులు వచ్చాయి. రోజు రోజుకూ ఎన్నో కొత్త వస్తువులు వచ్చాయి. రాధకూడా మునుపటిలాలేదు. హుషారుగా వుంటోంది. నాతో కూడా చాలా చనువుగా వుంటోంది. సినిమాలకి ఆహ్వానిస్తోంది. నాకంతా అయోమయంగా వుంది. ఏమనాలో, ఏం చెయ్యాలో తోచక తికమకపడుతున్నాను. ఎన్నో ప్రశ్నలు గుండెలదాకా పొంగుకువచ్చి చల్లబడిపోతున్నాయి. ఎల్లా అడగను? నాకేమధికార ముంది? అసలు అడగటానికి నేనెవరు?... రోజులు గడిచినకొద్దీ అయోమయం ఎక్కువవుతోంది.

ఒకరోజు రాత్రి కాస్త పెందరాళే ఇంటికి వచ్చేశాను. తలుపులు వేసివున్నాయి. దగ్గరకెళ్ళగానే ఇంట్లోంచి కిలకిలా నవ్వులు వినిపించాయి. నాకు ఆశ్చర్యంవేసింది. తలుపుతట్టాను. నవ్వులు చప్పున ఆగిపోయినాయి.

కాసేపటికి తలుపు ఓరగా తెరుచుకుంది. రాధ మొహం కనిపించింది. నన్ను బ్రతిమాలుతూ అంది "దయచేసి కాస్త ఓ గంట అలా తిరిగివస్తారా...?"

నా గుండెలు ఆగిపోయినాయి. ఇంకొక్క క్షణంకూడా నిలువలేక పారిపోయాను. పిచ్చివాడిలా వూరంతా తిరిగాను. రాత్రి పన్నెండింటికి ఓ సత్రం అరుగుపైన పడుకున్నాను.

"ఎందుకు?... ఎందుకిలా అయిందీ?... ఎవరు బాధ్యులు?... నేనా?... నేనేనా రాధను ఇలా తయారుచేసింది? రాజాను మోసం చేసింది.

"అవును. నేనేమో... నా నిర్లిప్తతే ఆమెకు ఈ దారిచూపిందేమో... నిజంగా రాధను ఒక జీవంలేని బొమ్మలాగే చూశాను. రాజా తిరిగివచ్చి, లేవనెత్తేదాకా అలానే పడివుండే బొమ్మ అనుకున్నాను. ఎంత పొరబాటు... కాని... కాని... నిజంగా నేను తలుచుకున్నా ఏమైనా చెయ్యగలిగి వుండేవాణ్ణేనా? జారుడు కాళ్ళకు బంధాలు వేయగలిగి వుండేవాణ్ణేనా? నాలో అంత తాహతు వుందా?" ఆ రాత్రల్లా కన్నుమలగలా.

తెల్లవారుఝామున్నే లేచి బయలుదేరాను. అప్రయత్నంగా ఇంటి వేపుకు నడిచాను.

ఇంకా తలుపులు వేసి వున్నాయి. ఏం చెయ్యాలో తోచక అరుగుపైన చతికిలబడ్డాను. లోపల నిశ్శబ్దంగా వుంది. కాసేపటికి తలుపు తట్టాను. సునాయాసంగా తెరుచుకుంది. లోనికి వెళ్ళిచూస్తే అంతా ఖాళీగా ఉంది. ఎవ్వరూలేరు. రాధ ట్రంకులో గుడ్డలుకూడా లేవు.

పసిడిబొమ్మ జీవం పోసుకు పోయింది....